అడుగడుగునా నిఘా..

- ఎన్నికల నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు
- పోలీస్ యాక్ట్ 30 అమలు
- అనుమతి లేకుండా సభలు నిర్వహిస్తే చర్యలు



ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు చేస్తున్న ఎస్పీ జగదీష్, పోలీసులు (ఫైల్)

కంబాలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తుగా ఈనెల ఒకటో తేదీ నుంచి సెక్షన్ 30 అమలులోకి వచ్చింది. ఎన్నికల బందోబస్తు కోసం నగరానికి కేంద్ర బలగాలు చేరుకున్నాయి. రాజమహేంద్రవరంలో గత ఎన్నికల్లో సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన పలు చోట్ల ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది పర్యవేక్షణలో కేంద్ర బలగాలు కవాతు చేస్తున్నాయి. దీనిలో భాగంగా రాజమహేంద్రవరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కేంద్ర బలగాలు పర్యటిస్తున్నాయి. ఎన్నికల్లో ఆటంకాలు సృష్టించేందుకు ప్రయత్నించే అరాచక శక్తుల ఆట కట్టించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు పంపుతున్నారు. ఇప్పటికే అన్ని స్టేషన్లకు సంబంధించి పోలింగ్ బూత్ వివరాలు, గతంలో అల్లర్లు జరిగిన ప్రాంతాల వివరాలు పోలీసులు సేకరించి ఆయా ఘటనలకు కారణమైన నాయకులు, కార్యకర్తలకు నోటీసులు పంపుతున్నారు. నిత్యం ఏదొక ప్రాంతంలో కవాతు నిర్వహించి ప్రజలకు ధైర్యం కల్పిస్తున్నారు. రౌడీషీటర్లు, సెటిల్‌మెంట్ గ్యాంగ్‌లతో పాటు ఎన్నికల నేరగాళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు ఎస్పీ పి.జగదీష్ ప్రత్యేక కార్యక్రమం రూపొందించారు.

30 వరకూ పోలీస్ యాక్ట్ అమలు

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో ఈ నెల 30వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుంది. రాజమహేంద్రవరంతో పాటు, ధవళేశ్వరం, బొమ్మూరు, కడియం, రాజానగరం ప్రాంతాల్లో సెక్షన్ 30 అమలులో ఉంటుంది. యాక్ట్ అమలులో ఉన్నంత కాలం ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదు. అటువంటివి నిర్వహించాలంటే పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

యువకులకు కౌన్సెలింగ్

ప్రజా శాంతికి భంగం కలిగిస్తున్న వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కడియం దేవీ సెంటర్‌లో ఘర్షణకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఘటనకు పాల్పడిన ఎనిమిది మంది యువకులను గుర్తించి, పెద్దల సమక్షంలో పోలీసులు వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ విషయం తెలిసిన జిల్లా ఎస్పీ తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్‌ను ఆదేశించారు. ఒకసారి క్రిమినల్ కేసుల్లో పేర్లు నమోదు అయితే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఉంటాయని, ఆ విషయాన్ని యువత మర్చిపోవద్దని హితవు పలికారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులు అందరూ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలి. ఎటువంటి కార్యకలాపాలు చేయాలన్నా, ఊరేగింపులు నిర్వహించాలన్నా తప్పనిసరిగా పోలీసు అనుమతి తీసుకోవాలి. మా పరిధిలో పూర్తి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. ఎవ్వరూ కవ్వింపు చర్యలకు పాల్పడరాదు. ఆ విధంగా ప్రవర్తిస్తే ఎంతటివారైనా చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడం. దీన్ని అందరూ గమనించాలి. ఎవరైనా అలా ప్రవర్తిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి.

– అంబికా ప్రసాద్,
సౌత్ జోన్ డీఎస్పీ, రాజమహేంద్రవరం.

24 గంటలూ తాగునీటి సరఫరా



డివిజన్‌లో పర్యటిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేస్తున్నానని, ప్రజలకు 24 గంటలూ రక్షిత తాగునీటిని సరఫరా చేసే బాధ్యత తనదేనని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం నగరంలోని 23వ డివిజన్‌లో పర్యటించారు. ప్రతి ఇంటికీ, వ్యాపారుల వద్దకు వెళ్లి ఓటర్ల మద్దతు కోరారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీగా నగరానికి చేసిన అభివృద్ధిని వివరిస్తూనే, ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను తెలిపారు. గోదావరి బండ్‌ను హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తానన్నారు.

క్లుప్తంగా

మృతి చెందిన యువకుడి వివరాలు లభ్యం



పాతర రాజబాబు (ఫైల్)

కంబాలచెరువు: డివైడర్‌ను ఢీకొట్టి మృతి చెందిన యువకుడిని రంపచోడవరానికి చెందిన పాతర రాజబాబు (32)గా పోలీసులు గుర్తించారు. మూడో పట్టణ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. రంపచోడవరానికి చెందిన పాతర రాజబాబు రాజమహేంద్రవరంలోని స్నేహితుడి ఇంటిలో జరిగే ఫంక్షన్‌కు ఆదివారం ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. సరిగ్గా మార్కెట్ యార్డు సమీపంలో రాత్రి సుమారు 10 గంటలు దాటిన తర్వాత డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాజబాబు తలకు గాయమై తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మూడో పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాల కోసం ఆరా తీశారు. ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబ సభ్యులకు విషయ తెలిపారు. తండ్రి పాతర చిన్నబ్బాయికి రాజబాబు మృతదేహాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వసతుల పరిశీలన

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి సోమవారం స్థానిక గౌతమీ జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. అక్కడ వసతులు, సదుపాయాలను పరిశీలించిన అనంతరం పిల్లలు, వయోవృద్ధులతో మాట్లాడి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

వారికి అందుతున్న సదుపాయాలలో ఏదైనా అసంతృప్తి ఉంటే తెలియజేయాలని సూచించారు. వేళకు భోజనం చేస్తూ మందులు వేసుకోవాలన్నారు. వారికి అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు, వయోవృద్ధులకు పౌష్టిక ఆహారంతో పాటు వేసవి కాలం ముగిసే వరకు మజ్జిగ అందించాలని ఆశ్రమ సిబ్బందికి సూచించారు. వృద్ధులకు, పిల్లలకు ఎండ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

బొమ్మూరు యువకుల భీమ్ దీక్ష

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామానికి చెందిన వడ్లమూరి రాము, ముమ్మిడివరపు రత్నప్రసాద్ సోమవారం నుంచి భీమ్ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రాజవోలు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి వరకూ ఈ దీక్ష చేయనున్నారు.

అధ్యాపకులకు శిక్షణ

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాల నోడల్ రిసోర్స్ విభాగం ఆధ్వర్యంలో డిగ్రీలో సింగిల్ మేజర్ విధానంపై అవగాహన, శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.శాస్త్రి మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ వరకు శిక్షణ జరుగుతుందన్నారు. 2023 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీ విద్యార్థులకు సింగిల్ మేజర్ సిస్టంను ప్రవేశ పెట్టారని, దీనిపై అధ్యాపకులకు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు.

హోమ్ ఓటింగ్‌పై అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: హోమ్ ఓటింగ్ విధి విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిటీ అసెంబ్లీ నియోజకవర్గం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎస్వీ రమణ, ఆర్ఎంసీ డిప్యూటీ కమిషనర్ కె.ఆంజనేయులు పేర్కొన్నారు. సోమవారం శ్రీ వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో సెక్టార్, బూత్ లెవెల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. 85 ఏళ్ల నిండిన వృద్ధులు, 40 శాతం వైకల్యం కలిగిన వారు, కోవిడ్ పేషెంట్లకు మాత్రమే ఈ సౌకర్యం కల్పించారన్నారు. అవసరమైనవారు 12డి ఫారంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జోస్ అలుక్కాస్ సేవలు అభినందనీయం



నమూనా చెక్కు అందజేస్తున్న అడిషనల్ కమిషనర్ సత్యవేణి

రాజమహేంద్రవరం సిటీ: పాఠశాలల అభివృద్ధికి జోస్ అలుక్కాస్ సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని రాజమహేంద్రవరం కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సత్యవేణి అన్నారు. రాజమహేంద్రవరం జోస్ అలుక్కాస్ సంస్థలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర చుట్టుపక్కల ప్రాంతాలలోని ఏడు జెడ్పీహెచ్, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లకు రూ.15 లక్షల చెక్కులను ఆమె చేతుల మీదుగా అందజేశారు.

ఆమె మాట్లాడుతూ బంగారు వస్తువుల వ్యాపారంలో పేరెన్నికగల జోస్ అలుక్కాస్ సీఎస్ఆర్ డొనేషన్ ప్రోగ్రాం చేయటం ఆనందదాయకమన్నారు. షోరూం ప్రతినిధి బాబు మాట్లాడుతూ దేశంలోని 52 బ్రాంచ్‌ల ద్వారా ఏటా సుమారు రూ.10 కోట్లను డొనేషన్ రూపంలో ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో షోరూమ్ మేనేజర్ జియో, అసిస్టెంట్ మేనేజర్ దనేష్ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలి

- మంత్రి వేణుగోపాలకృష్ణ
- డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి రాయుడుపాకలులో ఎన్నికల ప్రచారం



రాయుడుపాకలు గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: గడచిన 58 నెలల్లో ప్రజలకు చేకూరిన సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ కోరారు. ఆయన సోమవారం ఉదయం 8.30 గంటలకు రాయుడుపాకలు గ్రామంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలిసి మంత్రి వేణు ఇంటింటికి పర్యటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను అందించిన విషయాన్ని గమనించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. మంత్రి వేణు మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను మళ్లీ గెలిపించుకుంటేనే సంక్షేమం పారదర్శకంగా అందుతుందనే విషయాన్ని ప్రజలే చెబుతున్నారన్నారు. చంద్రబాబు అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేశారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం జరిగిందన్నారు. తెల్లవారుజామునే పింఛన్ అందాలన్నా, పిల్లల చదువులు సక్రమంగా సాగాలన్నా, ఖరీదైన వైద్యం పేదలకు అందాలన్నా ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి అసెంబ్లీ అభ్యర్థి అయిన తనను, పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు.



మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి వేణు, చిత్రంలో డాక్టర్ శ్రీనివాస్, చందన నాగేశ్వర్, షర్మిలారెడ్డి

ప్రజల ఆత్మీయ స్వాగతం

ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు.. ఫ్యాన్‌గుర్తుకు ఓటువేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అవ్వాతాతల పింఛన్ల విషయంలో చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌లు కోర్టుకు వెళ్లి విషపూరిత కుట్రకు దారి తీశారన్నారు. రాబోవు రోజుల్లో అవ్వాతాతల ఉసురు చంద్రబాబు కూటమికి తగులుతుందన్నారు. రాయుడుపాకలు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి వేణు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి, పార్టీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకులు గిరజాల వీర్రాజు (బాబు), నగరపాలక సంస్థ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి, కొప్పిసీడి ప్రసాద్ బాబు (రాజమౌళి), రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి చిన వీరభద్రయ్య, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, జిల్లా దివ్యాంగుల సెల్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, రాయుడుపాకలు పార్టీ నాయకులు పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, అల్లాడ వీర గణేష్, వాకపల్లి సుదర్శనరావు, నల్లమిల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో రజకుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: సమాజ సేవలో రజకుల పాత్ర అత్యంత కీలకమని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక రజకుల కల్యాణ మండపంలో సోమవారం జిల్లా రజక సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న భరత్‌రామ్ మాట్లాడుతూ రజకులలోని ఐక్యత, తోటి వారికి సహాయ సహకారాలు అందించే తీరు అభినందనీయమన్నారు. ఎంపీగా నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దానని, ఎమ్మెల్యేగా మీరు ఆశీర్వదించి గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నగరంలో గ్లో గార్డెన్ ఇండియాలోనే రెండవ అతిపెద్దదన్నారు. అలాగే కంబాల చెరువు పార్కును అద్భుతంగా తీర్చిదిద్దామన్నారు. నగరంలోని సుబ్రహ్మణ్యం మైదానం ఒకప్పుడు గంజాయి, మద్యం, జూదగాళ్లకు అనువైన స్థలంగా ఉండేదని, దానిని ఓపెన్ ఎయిర్ థియేటర్ గా ఎంతో చక్కగా అభివృద్ధి చేశామన్నారు. పుష్కర ప్లాజా, ఈట్ స్ట్రీట్, హ్యాపీ స్ట్రీట్ ఇలా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసుకుంటూ వచ్చామన్నారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నగరానికే తలమానికం కాబోతోందన్నారు. ఆ వంతెనను ఈ నెలాఖరున నగర వాసులచే ప్రారంభించి జాతికి అంకితం ఇవ్వబోతున్నట్టు తెలిపారు. రజకులకు కమ్యూనిటీ హాలు కావాలని కోరారని, ఎమ్మెల్యే కాగానే మీ కోరిక తప్పక నెరవేర్చే బాధ్యత తనదేనన్నారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, మాజీ కార్పొరేటర్ పోలు విజయలక్ష్మి, పార్టీ నగర అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, రజక సంక్షేమ సంఘ నాయకులు బొమ్మదేవర శ్రీనివాస్, పాలమూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలపై టీడీపీ నేతల వ్యాఖ్యలు అనైతికం

- నగరాభివృద్ధిని చూసి వారిలో వణుకు
- ఎంపీ భరత్‌రామ్ ధ్వజం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో నిరుపేదలకు పక్కా లే అవుట్ చేసి ఇళ్ల పట్టాలు ఇచ్చామని, దానిని టీడీపీ నాయకులు బోగస్ అనడం దుర్మార్గమని స్థానిక ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసాలకు పాల్పడే టీడీపీ నేతలు బయటకు రాలేక.. ఏది చూసినా మోసం అనడం అలవాటు అయ్యిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగనన్న 31 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. డీటీసీపీ లేఅవుట్ చేసి ఇస్తే భోగస్ పట్టాలని, ఫేక్ పట్టాలని ఆరోపించడం లబ్ధిదారులలో అనుమానం, వ్యతిరేకత తీసుకొచ్చే రాజకీయ కుట్ర తప్పిస్తే మరొకటి కాదన్నారు. దొంగ పట్టాలిచ్చేంత దౌర్భాగ్య పరిస్థితి తమకు లేదన్నారు. ఒకే రోజు 25 వేల కుటుంబాలకు ఇళ్ల పట్టాలిచ్చి రికార్డు సృష్టించామన్నారు. ఒకేసారి ఇన్ని వేలమందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేసరికీ వాసుకు వణుకు పుట్టి తనపై బురద చల్లే పని ప్రారంభించారన్నారు. సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

నమ్మిన దైవంపై విశ్వాసం ఉండాలి

నమ్మిన దైవం పట్ల విశ్వాసం, భక్తి ఉండాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. దానవాయిపేట మదీనా మస్జిద్ అండ్ షాదీ ఖానా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరత్ రామ్ మాట్లాడుతూ ముస్లింలు పవిత్ర మాసంలో నిర్వహించే కఠోర ఉపవాసం అల్లాపై ఉన్న భక్తికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్, ఉపాధ్యక్షుడు మహమ్మద్ షబ్బీర్, కార్యదర్శి సయ్యద్ అల్తాఫ్, కోశాధికారి మహమ్మద్ బషీర్ అహ్మద్, సభ్యులు షేక్ జిలానీ, సయ్యద్ అబ్దుల్ అఫ్సర్, షేక్ ఉస్మాన్ బాషా పాల్గొన్నారు.

ముగ్గురు ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు



అవార్డు అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సకాలంలో సమస్యలను గుర్తించి ప్రమాదాలు జరగకుండా సిబ్బందిని అప్రమత్తం చేసిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ద మంత్ జీఎం సేఫ్టీ అవార్డులు' వరించాయి. సోమవారం దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో ఏజీఎం ధనుంజయులు విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో భద్రతా చర్యలపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ క్రమం తప్పకుండా సేఫ్టీ డ్రైవ్‌లు, రాత్రుళ్లు సెక్షన్‌లలో తనిఖీలు చేపట్టాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ వ్యవస్థలో లోపాలను గమనించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డ్స్ ఫిబ్రవరి-2004కి ఎంపికైన ఉద్యోగులను ఏజీఎం ప్రకటించారు. విజయవాడ డివిజన్ నుంచి ఎంపికైన రాజమహేంద్రవరంలో టెక్నీషియన్ ఎస్ఎస్ బ్రహ్మయ్యం, కాకినాడ పోర్టులో గూడ్స్ లోకో పైలట్ కేవీవీఎస్ నారాయణ, విజయవాడ ట్రాలీ మెన్ వి.వీర లింగేశ్వరరావులకు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తన కార్యాలయంలో జీఎం అవార్డులను అందజేసి అభినందనలు తెలిపారు.

నగరాభివృద్ధికి భరత్ విశేష కృషి



మాట్లాడుతున్న రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: నగరాభివృద్ధికి ఎంపీ భరత్ రామ్ ఎంతో కృషి చేశారని, ఆయన ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక ఎంపీ భరత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నగరానికి జరిగిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, రాజమహేంద్రవరం పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, పోలు విజయలక్ష్మి, అజ్జరపు వాసు పాల్గొన్నారు.

ప్రతిపక్షాల తీరుతో వలంటీర్ల రాజీనామా



రూరల్ ఎంపీడీవో శ్రీనివాసరావుకు రాజీనామాలు అందిస్తున్న శాటిలైట్ సిటీ వలంటీర్లు

రాజమహేంద్రవరం రూరల్: ప్రజలకు సేవ చేస్తున్న తమపై రాజకీయ పార్టీలు నిందలు వేస్తున్నాయని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం రూరల్ మండలంలోని ఎనిమిదిమంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. శాటిలైట్ సిటీ సచివాలయం-3కు చెందిన రుంకాని విజయలక్ష్మి, లబ్బా కృష్ణవేణి, గొడ్డి ఉమా మహేశ్వరరావు, చెక్కా అపర్ణ, లంకా సంతోషిణి, హుకుంపేట సచివాలయం -2కి చెందిన సందిపర్తి లావణ్య, పొట్టింగ నాగమణి, చిట్టిబోయిన లక్ష్మి రాజీనామా చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే బొమ్మూరు గ్రామసచివాలయం-2 వలంటీర్ నూనె దీపశ్రీ రాజీనామా చేసింది.

కడియం మండలంలో..

కడియం: మండల పరిధిలోని వేమగిరి నుంచి నలుగురు, కడియపులంక నుంచి ఒక వలంటీర్ సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్‌కు అందజేశారు. పేదలు, వృద్ధులు, వికలాంగులకు సేవలందిస్తున్న తమను కొందరు నాయకులు ఉగ్రవాదులు అంటూ కించపరచడాన్ని నిరసిస్తూ తాము రాజీనామా చేస్తున్నట్లు ఆ లేఖలో పేర్కొన్నారని ఎంపీడీవో తెలిపారు.



కడియం ఎంపీడీవో రాజ్‌మనోజ్‌కు రాజీనామా అందజేస్తున్న వేమగిరి వలంటీర్లు

ఆదర్శప్రాయుడు పోతుల వీరభద్రరావు



వివిధ రంగాల్లో సేవలందించిన ప్రముఖులను సత్కరిస్తున్న నాయకులు

ప్రకాశం నగర్: మాజీ ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుల వీరభద్రరావు నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని పలువురు వక్తలు కొనియాడారు. శ్రీ పోతుల వీరభద్రరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయన 25వ వర్ధంతి సభను సోమవారం సాయంత్రం కందుకూరి వీరేశలింగంపుర మందిరం (టౌన్ హాల్)లో నిర్వహించారు. కార్యక్రమానికి రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాలలో సేవలందించిన వారిని సత్కరించారు. కార్యక్రమానికి ట్రస్ట్ అధ్యక్షుడు వీఎస్ మూర్తి అధ్యక్షత వహించారు. డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు, జూబ్లీ టౌన్‌హాలు అధ్యక్షుడు జగన్నాథం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగళవారపుపేటలో..

స్థానిక మంగళవారపుపేటలో జరిగిన పోతుల వీరభద్రరావు వర్ధంతి కార్యక్రమానికి సినీ, రాజకీయ విశ్లేషకుడు ఆడబాల మరిడయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.